# ఫుట్ వేర్ షాపులో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదానికి బూడిదైన ఫుట్ వేర్ షాపు

## - 50 లక్షల ఆస్తి నష్టం

**చార్మినార్, జూన్ 12 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ పురానీహవేలిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఫుట్ వేర్ షాపు కాలి పోయింది. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని మీర్‌చౌక్ పోలీసులు భావిస్తున్నారు. దాదాపు 50 లక్షల రూపాయల వరకు ఆస్థి నష్టం జరిగింది. మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ కథనం ప్రకారం.....పాతబస్తీకి చెందిన సుల్తాన్‌ఖాన్ పురానీహవేలిలో ఎస్‌కె ఫుట్ వేర్ షాపును నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఆకస్మాత్తుగా షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగింది. అగ్ని ప్రమాదంలో షాపు దగ్ధం అయ్యింది. అగ్ని మాపక దళాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశాయి. దాపు 50 లక్షల రూపాయలు వరకు ఆస్థి నష్టం జరిగిందని దుకాణం యజమాని సుల్తాన్ ఖాన్ మీర్ చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్ వార్త

# మోగిన బడిగంట...

**-స్కూల్‌బాట పట్టిన విద్యార్థులు -సర్కారు బడుల్లో ఉచితంగా యూనిఫామ్, బుక్స్ పంపిణీ**

**-స్కూళ్లు-కాలేజీ బస్సుల్లో ఆర్టీవో అధికారుల తనిఖీలు -నిబంధలు పాటించని స్కూల్ బస్సులు సీజ్**







**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రవేట్ రెసిడెన్షియల్ అన్నిరకాల విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. 48రోజులపాటు వేసి సెలవుల అనంతరం పిల్లలు ఉత్సాహంగా బడి కి చేరుకున్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను అలంకరించి ,ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు ,బెలున్లతో అలంకరించి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. వాటిని మంత్రులు, ఎమ్మెల్యేలు ,ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేస్తున్నారు. బుధవారం హైదరాబాద్ జిల్లాలోని అబిడ్స్ అలియా ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్కూల్‌డ్రెస్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ 26వేల ప్రభుత్వ పాఠశాలలకు 11వందలకోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. గత పదేళ్లలో విద్యావ్య వస్థ నిర్వీర్యం అయ్యిందని ,ప్రస్తుత ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అలియాలోని ప్రభుత్వ పాఠశాలకు గొప్ప చరిత్ర ఉందని మంత్రి పొన్నం కొనియాడారు. విద్యార్థులు ఆసక్తిగా చదవడంతోపాటు ఆటల్లో రాణించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్, డిప్యూటీ మేయర్ మేతేశ్రీలత , డీఈవో రోహిణి అధికారులు పాల్గొన్నారు.

### స్కూల్-కాలేజీ బస్సుల్లో ఆర్టీవో తనిఖీలు ..

విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ఆయా విద్యాసంస్థల బస్సులపై ఆర్టీవో అధికారులు దృష్టి సారించారు. గ్రేటర్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని స్కూల్‌బస్సులపై వేటు వేస్తున్నారు. ఫిట్నెస్ కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. లంగర్‌హౌజ్‌లో స్కూల్, కాలేజీ బస్సులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని స్కూల్‌బస్సులను సీజ్ చేశారు. డ్రైవర్ లైసెన్స్ గడువు ముగియడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు రాజేంద్రనగర్‌లో, శంషాబాద్, మెయినాబాద్, శేరిలింగపల్లిలో స్కూల్ బస్సులు తనిఖీ చేపట్టారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ లైసెన్స్, ఫైర్‌సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

## వర్షాలు, వరదలతో ఎలాంటి ప్రాణనష్టం జరగొద్దు

**-అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**-పారిశుద్య నిర్వాహణ, వాటర్ లాగింగ్ పాయింట్ల పై దృష్టి సారించాలి**

**-జిహెచ్‌ఎంసి సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంచార్జ్ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ విజయలక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్నివిధాల పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయాశాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఈమేరకు బుధవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశమందిరంలో జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ మేతే శ్రీలత శోభన్‌రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలితో కలిసి జిహెచ్‌ఎంసి మాన్‌సూన్ ప్రిపరేషన్ ప్లాన్, శానిటేషన్, ఫుడ్‌సేఫ్టీ, నాలా, యుబిడి, బక్రీద్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ ఆమ్రపాలి మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్‌ను మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, వర్షాలు, వరదల వల్ల ఏఒక్క ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం జిహెచ్‌ఎంసి అండగా ఉంటుందని ,ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందరకం కలిషి పరిష్కరిద్దామని పార్టీలకు అతీతంగా కార్పొరేటర్లు, శాసన సభ్యులు పనిచేద్దామన్నారు. నాలాల్లో డిసిల్టింగ్ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ,ప్రజలు కూడా నాలాలో వ్యర్థాలు వేయకుండా ప్రవాహనం సాఫీగా వేళ్లేలా చూడాలన్నారు. అలాగే అంటు వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పారిశుద్ద నిర్వాహణపై క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాలన్నారు. రెస్టారెంట్‌లు, హోటళ్లలో నాణ్యమైన, హైజనిక్ ఫుడ్ అందించేలా చూడాలని ఫుడ్‌సేఫ్టీకి సంబంధించి ప్రతిజోన్‌కు ఒక వాహనం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే పబ్లిక్ గ్రీవెన్స్‌కు సంబంధించినవి డిస్‌ప్లే చేయాలని, లేక్స్ పొటెక్షన్‌పై దృష్టి సారించాలన్నారు. లేక్స్‌డెవలప్‌మెంట్‌ను సిఎస్‌ఆర్ కింద చేపట్టి కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు అందించేలా చూడాలన్నారు.

### అధికారులపై మంత్రి సీరియస్ ...

ఈసందర్భంగా సమీక్షా సమావేశంలో పలుసందర్భాల్లో జిహెచ్‌ఎంసి అధికారులపై మంత్రి పొన్నం సీరియస్ అయ్యారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారుల సమాధానం సంతృప్తిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్స్ కంటే ఎక్కువ చోట్ల ఎందుకు నీళ్ల అగుతున్నాయని ప్రశ్నించారు. శానిటేషన్ అధ్వన్యంగా ఉందన్న మంత్రి ఎందుకు పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని నిలదీశారు. అధికారులందూ కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఈఎన్‌సి జియాఉద్దీన్, ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఎస్‌ఎన్‌డిపి సిఈ కోటేశ్వర్‌రావు, సిఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు స్నేహా షబరీష్, అభిలాష అభినవ్, హేమంత్ సహదేవ్, రవికిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్ బండ్‌లోకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్‌లో దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడిన ఘటన తాజాగా చోటు చేసుకుంది. అది గమనించిన స్థానిక కానిస్టేబుల్ వెంటనే అప్రమత్తమయ్యాడు. అతడు వెంటనే చుట్టు ప్రక్కల వారికి సమాచారం అందించడంతో, ఆ పోలీసు కానిస్టేబుల్‌తో పాటు ఈత వచ్చిన కొందరు స్థానికులు ట్యాంక్ బండ్‌లోకి దిగి, దూకిన వ్యక్తిని కాపాడారు. అనంతరం పోలీసులు అతనిని అంబులెన్స్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దాంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దూకిన వ్యక్తి ఎవరు, ఆత్మహత్యకు ప్రేరేపించిన విషయాలేంటి అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# రూపం మార్చుకుంటున్న సైబర్ నేరం

**-అరెస్ట్ వారెంట్ ఉందంటూ సుప్రీం కోర్టు వెబ్‌సైట్ లింకు పంపారు**

**-అప్రమత్తమైన బాధితురాలు**

**-అవగాహన సదస్సులో పోలీసుల సూచనలు**



**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** సైబర్ నేరం నిరంతరం తన రూపం మార్చుకుంటుందని పోలీసులు అంటున్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, నగదు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని సైబర్ క్రైం పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. బషీర్‌బాగ్‌లోని తెలంగాణ పరిశ్రమ భవనంలో బుధవారం జరిగిన సైబర్ నేర అవగాహనా కార్యక్రమంలో పోలీసులు మాట్లాడారు. ఫేక్ లోన్ యాప్‌లు, ఫెడ్‌ఎక్స్, బిఎస్‌ఎన్‌ఎల్, ట్రాయ్ స్కామ్‌లు, షేర్ మార్కెట్, పార్ట్ టైం ఉద్యోగాల మోసాలు, సామాజిక మాధ్యమాల్లో వేదింపులు తదితర అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రసంగించారు. ప్రజలను ద్ధేశిస్తూ, సైబర్ నేరగాళ్ళు తమను తాము ఉన్నత ప్రభుత్వ అధికారులుగా చెప్పుకుంటారనీ, బాధితులపై మనీ ల్యాండరింగ్ వంటి ఫ్రాడ్ కేసులున్నట్లు బెదిరించి, బ్యాంకు వివరాలు అడుగుతారనీ, ఖచ్చితంగా తమ డబ్బు తిరిగి పంపేస్తామని హామీలిస్తూ నమ్మబలుకుతారని చెప్పారు. అంతే కాకుండా సెక్యూరిటీస్ ఎక్సేంజ్ బోర్డాఫ్ ఇండియా పేరు చెప్పి పెనాల్టీలు పడతాయని భయపెట్టి పెట్టుబడుల పేరుతో దోపిడీ చేస్తారన్నారు. ఈ క్రమంలో అవగాహనా లేమి వల్ల వారు చిన్న తప్పు చేస్తారనీ, దీనిని బట్టి తమకొచ్చిన ఫోన్ కాల్ నకిలీదని సామాన్యులు గుర్తించవచ్చని చెప్పారు. అటువంటి ఒక కేసులో బాధితులను భయపెట్టే క్రమంలో, అరెస్ట్ వారెంటుని సుప్రీం కోర్టు వెబ్ సైట్‌లో ఉందని చెబుతూ లింక్ పంపగా మోసగాళ్ళకు డబ్బుని బదిలీ చేయకుండా బాధితులు అప్రమత్తమయ్యారన్నారు. సైబర్ మోసగాళ్ళ మాటలకు లొంగవద్దనీ, నకిలీ వెబ్‌సైట్లలో ఎటువంటి వస్తువూ కొనుగోలు చేయవద్దని సూచించారు. ఫ్రాడ్ ఈమెయిల్స్‌కీ, ఫ్రాడ్ పాప్‌అప్‌లనీ తెరవవద్దని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహిణులను, రిటైరైన వృద్ధులనూ సైబర్ నేరస్థులు అధికంగా టార్గెట్ చేస్తున్నట్లు సైబర్ పోలీసులు తెలిపారు. సాంకేతిక పధజాలంతో పాటూ, ప్రభుత్వ వ్యవస్థకు చెందిన క్లిష్టమైన వివరాలనూ, జర్గలరీని వాడి, ధైర్యంగా మాట్లాడుతూ, సైబర్ నేరస్థులు మోసాలకు పాల్పడుతుంటారని చెప్పారు. తాజాగా ఇటువంటి ఘటనని పోలీసులు తెలియజేశారు.

### అరెస్ట్ వారెంట్ పేరుతో సుప్రీం కోర్టు వెబ్‌సైట్ లింకు పంపించారు:

నగరానికి చెందిన గృహిణిని, జెట్ ఎయిర్‌వేస్ స్థాపకుడు నరేష్ గోయల్ చేసిన రూ.200కోట్ల మనీ లాండరింగ్ కేసులో తన పేరు ఉందని బెదిరించిన సైబర్ నేరగాళ్ళు, ఆమె అరెస్ట్ వారెంట్ లింకు పేరుతో సుప్రీమ్ కోర్టు వెబ్ సైట్ లింకును పంపించారు. దాంతో ఆమె అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే, హైదరాబాద్‌కు చెందిన గృహిణి(47) నుంచి రూ.6లక్షలు కాజేసే ప్రయత్నం చేశారు సైబర్ నేరగాళ్ళు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, తొలుత భారత టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్) పేరుతో నకిలీ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన మోసగాడు, బాధితురాలి పేరు మీద తప్పుడు ప్రకటనలు, వేదింపులతో కర్ణాటక, ముంబై పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, ఆమె ఆధార్ కార్డు వివరాలతోనే సిమ్ కార్డు తీసుకుని ఈ నేరానికి పాల్పడ్డారని, ఆమెను అరెస్టు చెయ్యవలసి ఉంటుందని భయపెట్టాడు. ఆమె ఆ విష్యాలను ఖండించగా, సిబిఐ నుంచి మరో ఫిర్యాదు అందిందనీ, జెట్ ఎయిర్‌వేస్ స్థాపకుడు నరేష్ గోయల్ రూ.200కోట్ల మనీ లాండరింగ్ కేసులో తన పేరు కూడా ఉందని, విచారణకు ముంబై రావలసి ఉంటుందని హెచ్చరించాడు. అంతే కాకుండా బాధితురాలి పేరు మీద ముంబై కెనరాబ్యాంకులో కొత్తగా తెరిచిన ఖాతాను మనీ ల్యాండరింగ్ నేరానికి వాడారని, ఆమె క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులు నరేష్ గోయల్ ఇంట్లో లభించాయని నమ్మబలికాడు. అనంతరం ఈ కేటుగాళ్ళ బృందం, బాధితురాలికి స్కైప్ నుంచి వీడియోకాల్ చేసి తమను తాము పోలీసులుగా నమ్మబలికారు. ఆమెను ఎవరినీ కలవనివ్వకుండా జన సంచారం లేని ప్రదేశంలో ఉండాలంటూ ఆదేశించారు. ఈ కేసు గురించి ఆమె కుటుంబీకులకు గానీ, సన్నిహితులకు గానీ తెలుపవద్దని, వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అప్పటికే భయాందోళనలకు గురైన బాధితురాలు, తాను స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి తేల్చుకుంటానని చెప్పగా, ఇది నేషనల్ సెక్యూరిటీ వ్యవహారమనీ, స్థానిక అధికారులను జోక్యం చేసుకోనివ్వరంటూ నమ్మబలికారు. అనంతరం బాధితురాలి బ్యాంకు వివరాలు అడిగి అందులో ఉన్న రూ.6,45,000 తమకు తాత్కాలిక బదిలీ చేయవలసినదిగా చెప్పారు. ఆమె బ్యాంకు ఖాతా ఆర్‌బీఐ ఆమోదం పొందిందా లేదా అనేది పరిశీలించాకా తిరిగి ఆమెకే ఆ నగదు పంపేస్తామని మభ్యపెట్టారు. అంతకంటే ముందు ఆమెకు జారీ అయిన అరెస్ట్ వారెంట్లను అడుగగా సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ లింకు పంపించడంతో, ఇది మోసగాళ్ళ పనే అని బాధితురాలు సమయానికి గుర్తించి, వారికి నగదు పంపించేందుకు నిరాకరించి, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో ఇది మోసం చేసి నగదు కాజేసే ప్రత్నమని సైబర్ పోలీసుల జోక్యంతో తేటతెల్లమైంది. వీడియో కాల్‌లో కనిపించే పోలీసులు నిజమైన పోలీసులు కాదని, అదంతా మోసం కోసం చేసిన సెటప్ అని పోలీసులు స్పష్టం చేశారు. ఇటీవలె ఇటువంటి మోసపూరిత కేసులు సంభవిస్తుండడంతో ప్రజలను అప్రమత్తంగా ఉండాలన్నారు.

## అంకురార్పణతో టిటిడి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానములు, బాలాజీ భవన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రాహోత్సవాలు బుధవారం సాయంత్రం అంకురార్పణంతో ఘనంగా ప్రారంభమైనాయి. వేద పండితులు, అర్చకులు మంత్రోచ్ఛరణలు, సన్నాయి రాగాలు, మేళతాళాల మధ్య ఈ అంకురార్పణ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. నేటి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఈ బ్రాహ్మత్సోవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని దేవాలయానికి అందంగా రంగులు వేశారు. విద్యుత్ దీపాలు, పూల దండలతో దేవాలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించిన భారీ కటౌంట్లును ఏర్పాటు చేశారు. ఈ అంకురార్పణ కార్యక్రమంలో టిటిడి ఎఈఓ రమేష్‌బాబు, దేవాలయం లోకల్ అడ్వయిజరి కమిటి మాజీ ఉపాధ్యాక్షుడు త్రినాథబాబుతోపాటు దేవాలయం ఉద్యోగులు, సిబ్బంది, వందలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. 13వ తేదీ ఉదయం ధ్వజారోహణం, ఆ తరువాత శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు పుర వీధుల్లో కొనసాగుతుంది. రాత్రి 8 గంటలకు శ్రీహనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు, 14వ తేదీ ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు, 10 గంటలకు స్నపన తిరుమంజనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీ స్వామి ఊరేగింపు పుర వీధుల్లో కొనసాగుతుంది. అలాగే 15వ తేదీ ఉదయం గజ వాహనంపై శ్రీస్వామి ఊరేగింపు, 10 గంటలకు శాంతి కళ్యాణం, రాత్రి 8 గంటలకు శ్రీవారి ఊరేగింపు, 16 తేదీ ఉదయం వేలాది మంది భక్తుల సమక్షంలో పురవీధుల్లో శ్రీవారి రథోత్సవం జరుగుతుందని, రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై శ్రీవారి ఊరేగింపు, చివరి రోజు 17వ తేదీ ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, పదిన్నర గంటలకు శ్రీవారికి చక్రస్నాం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణంతో బ్రాహ్మోత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతం సేవతోపాటు అన్ని రకాల సేవలతోపాటు రాత్రి తోమ్మిదన్నర గంటలకు శ్రీవారికి ఏకాంత సేవ జరుగనున్నాయి. ఈ బ్రాహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు రోజు ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్నప్రసాద వితరణ జరుగుతుంది.


వార్షిక బ్రాహ్మోత్సవాల అంకురార్పణ నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు. చిత్రంలో రమేష్‌బాబు, త్రినాథబాబు తదితరులు

# చినుకు పడితే చిత్తడే...

**-రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బారులు తీరుతున్న వాహనాలు**

**-పూడికలు తీయని డ్రైనేజీలతో రోడ్లపైనే వర్షపునీరు**

**-లోతట్టు ప్రాంతాలలో నరక యాతనే**

**పంజాగుట్ట జూన్ 12 ప్రభాతవార్త :** చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం కావడంతో పాటు బారులు తీరి వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి వాహనదారులు విలవిల్లాడిపోతున్నారు. వర్షాకాలం ప్రారంభానికిముందే నాలాలలో పూడికలు తీసి, మ్యాన్‌హోల్‌ల మరమ్మత్తులు చేయాల్సిన అధికార యంత్రాంగం పట్టీపట్టనట్ట్యువహరిస్తున్న కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగాఖైరతాబాద్ చౌరస్తా నుండి సంజీవరెడ్డినగర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారిలో ప్రయాణించే వారు చినుకు పడితేనరకయాతన అనువిస్తున్నారు. గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న తేలికపాటి వర్షానికే వాహనాలు బారులు తీరుతున్నాయి. ముఖ్యంగా పంజాగ్టు నిమ్స్ నుండి చౌరస్తా వరకు రావడానికి మంగళవారం అరగంట సమయం పట్టిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా డ్రైనేజీలు పూడికలు తీయని కారణంగా వర్షపునీరురోడ్లపైనే నిలిచిపోతున్నది. మ్యాన్ హోల్ తీసినా వాటినుండి నీరు పోవడంలేదు. దీంతో రోజుల తరబడి వర్షపునీరు వర్షపునీరు రోడ్లపైనే నిలిచిపోతున్నది. రోడ్లపై నీరు నిలిచిపోతున్న కారణంగా వాహనాల సైలెన్‌సర్ లలోకి నీళ్లుపోయి రోడ్లపై ఆగిపోయిన దృశ్యాలు ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులలోనేపరిస్థితి ఈ విధంగా ఉంటే లోతట్టు ప్రాంతాలలో రోడ్లన్నీ జలమయమై మరీ దయనీయంగా పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. నిన్న కురిసిన కుండపోత వర్షానికి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలన్నీజలమయమయ్యాయి. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి ట్రాఫిక్ పోలీసులు నానా అవస్థలు పడ్డారు. ఓ వైపు కుండపోత వర్షం, మరో వైపుబారులు తీరిన వాహనాలతో వాహనదారులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ముఖ్యమంత్రి, గవర్నర్, ఇతర మంత్రులునిత్యం రాకపోకలుసాగించే ప్రాంతాలు అవడంతో వర్షం పడినపుడు వీఐపీ ప్రయాణిస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంజగుట్టలో విధులు నిర్వహించే ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి రోడ్లపై వరదనీరు పోటెత్తుతుండడంతో రోడ్లపైప్రయాణించే వారు సమయానికి గమ్యానికి చేరుకోలేపోతున్నారు. ఇపుడే ఇలా ఉంటే మున్ముందు కురిసే భారీ వర్షాలకు పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ శాఖలఅధికారులు సమన్వయంతో వ్యవహరించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి ఎక్కడ ఇబ్బందులు తలెత్తుఉన్నాయనే విషయంలో సమగ్ర నివేదిక తయారు చేసి అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటే కొంతమేర సమస్య పరిష్కారమయే ్యఅవకాశం ఉందని రిటైర్ట్ పోలీసు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. బుధవారం నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈవిషయమై అధికారులకు దిశానిర్దేశం చేయడం కొంతమేర సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలి : పద్మారావు గౌడ్



అడ్డగుట్ట ప్రభుత ్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్,పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**అడ్డగుట్ట,జూన్ 12 ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం అడ్డగుట్ట అజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ స్కూల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, విద్యా పరంగా అభివృద్ధి చెంది సమాజావృద్ధి కోసం పాటుపడాలన్నారు. సికింద్రాబాద్‌లోని 30 ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫారం, పాఠ్య పుస్తకాలు అడ్డగుట్ట కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, ఉప విద్యా శాఖ అధికారులు బాలు నాయక్, మోహన్ రెడ్డిలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, గీతా దయాకర్ ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, కైరం కొండ యాదగిరి, శ్రీరామ్ నాయక్, అమర్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఏపిలో ప్రమాణ స్వీకారోత్సవం..కెపిహెచ్‌బి కాలనీలో సంబురాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న జనసేన శ్రేణులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 12, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేస్ జనసేన పార్టీ ఆఫీసులో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ జనసేన నాయకులు, వీర మహిళలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం మీడియా కో ఆర్డినేటర్ కొల్లా శంకర్ మాట్లాడుతూ ఇది ప్రజల విజయమని దశాబ్ద కాలంగా పవన్ కళ్యాణ్, జన శ్రేణులు ప్రజల కొరకై పోరాడి ప్రభుత్వాన్ని ప్రశ్నించి 2024 అసెంబ్లీ ఎన్నికలలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకత్వంలో జనసేప పార్టీ అధినాయకుడు కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 21 ఎమ్మెల్యేలు ఘనంగా విజయాన్ని సాధించారని ఇక నుండి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పాలన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు, బోగాది శేషగిరిరావు, పూషడపు సురేష్, శ్రీనివాస్ గోవింద, ఆవుల రంగబాబు, బండారి వెంకటేష్, ఘంట నవీన్, గుణశేఖర్, క్రాంతి కుమార్, వీర, నీరజ్, మురళి, బాలాజీ, వీర మహిళలు ఎర్ర సత్యా, అడబాల లక్ష్మీ, గాలి అనిత తదితరులు పాల్గొన్నారు.

## విద్య అనేది అత్తిపెద్ద ఆస్తి

### -ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ జూన్12,ప్రభాతవార్త :**
విద్య అనేది ప్రతి ఒక్కరూ వద్ద ఉండే అతి పెద్ద అస్తి అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లిలో గల ఉన్నత పాఠశాల పున:ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ,యూనిఫామ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...బడికి వెళ్లాల్సిన బాల్యం బందీగా మారకముందే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం...బాలలందరిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదామని అన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరీ బాధ్యతని ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదవే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ,ఎంఈఓ రాంరెడ్డి,స్కూల్ చైర్మన్ ,స్కూల్ ఉపాధ్యాయులు,విద్యార్థులు,ఉన్నారు.

### బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు అరెస్టు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఐ చంద్రశేఖర్

**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:**
ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధించి, చివరికి బేదిరింపులతో తన వాంఛను తీర్చుకున ్న వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో 7వ తరగతి చదువుతున్న ఓ మైనర్‌బాలికను దూరపు బంధువువైన హిమాయత్‌నగర్ నివాసి ప్రియదర్శికుమార్ సైగల్ గత కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. అంతేకాకుండా రెండుమూడు సార్లు అతను వ్యాపారం చేసే ప్రదేశానికి ఆ బాలికను తీసుకువెళ్లి తన వాంఛను తీర్చుకున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఆ బాలిక డిప్రెషన్‌కు లోనై భయ బ్రాంతులకు గురైంది. కాగా ఆ బాలిక ఈ నెల 3వ తేదీన నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు బుధవారం ప్రియదర్శికుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరపరచడం జరిగింది. నిందితుడ్ని పట్టుకోవడంలో పూర్తిగా సహకరించిన ఎస్ఐ నరేష్, కానిస్టేబుల్ విష్ణు, హోం గార్డ్ గౌస్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. వారికి రివార్డు కూడా అందిస్తామని చెప్పారు.

## శ్రీ మహదేవ్ మందిరంలో అద్భుతమైన స్పటిక శివ లింగం



అద్భుతమైన స్పటిక శివ లింగం

**చార్మినార్,జూన్ 12 ప్రభాతవార్త :**
చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో ఉన్న స్పటిక శివ లింగానికి ప్రతీ రోజు వందలాది మంది భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు, అభిషేకాలు జరుపుతున్నారు.చార్మినార్‌కు అతి దగ్గరల్లో పురాతనమైన చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం ఉంది.చార్‌కమాన్ షరాఫా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజస్థాన్ నుంచి తీసుకు వచ్చిన ఎంతో అద్భుతమైన స్పటిక శివలింగాన్ని ఈ మందిరంలో ప్రతిష్టించారు.అద్భుతమైన ఈ స్పటిక శివలింగాన్ని జంట నగరాలలోని భక్తులతో పాటు చార్మినార్‌ను తిలకించటానికి వస్తున్న పర్యాటకులు సైతం మందిరాన్ని సందర్శించి స్పటిక శివలింగానికి అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ప్రతీ సోమవారం రోజున పరమ శివునికి పూజలు నిర్వహించటానికి భక్తులు తరలి వస్తుండటంతో మందిరం పరిసర ప్రాంతాలు రద్దీగా ఉంటాయి.మందిరం నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు అభినందనలు

**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 4వ ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబునాయుడు, మంత్రులుగా కొణిదెల పవన్‌కళ్యాణ్, నాదేండ్ల మనోహార్ ప్రమాణస్వీకారం చేయడం పట్ల లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు అభినందనలు తెలియజేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందగలదన్న అశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగాలని ఆయన ఆకాక్షించారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



గాంధీభవన్‌లో సిఎం రేవంత్ చిత్రటానికి పాలాభిషేకం చేస్తున్న గోపాలమిత్రులు

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గోపాలమిత్రులు పాలాభిషేకం చేశారు. 2021 జూన్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు పెండింగ్‌లో ఉన్న 21నెలల పిఆర్‌సి అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర జేఏసీ అధ్యక్షులు మారబోయిన రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని జేఏసీ ప్రతినిధి బృందం గాంధీభవన్‌కు చేరుకుని రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత 23ఏళ్లుగా పశుసంవర్ధక శాఖలో గోపాలమిత్రులుగా పనిచేస్తూ పాడిరైతులకు అండగా ఉంటున్నామన్నారు. అయినప్పటికీ చాలీచాలని జీతాలతో వెల్లదీస్తున్నామన్నారు. గతప్రభుత్వంలో తమగోడును వెల్లబోసుకున్నా ఎవరు పట్టించుకోలేదని ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తమ సమస్యను పరిష్కరించి 21నెలల పిఆర్సీ అందజేశారని కావున గోపాలమిత్రుల తరపున సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ భాస్కర్ నాయక్, సలహాదారుడు మిరియాల చిన్నోజి తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో జోరుగా రెయిన్ కోట్‌ల అమ్మకాలు

**చార్మినార్,జూన్ 12 ప్రభాతవార్త :**
వర్షా కాలం ప్రారంభం కావటంతో ప్రజలు రక్షణ కోసం రెయిన్ కోట్‌లను ఖరీదు చేస్తున్నారు.కొద్ది రోజులు క్రితం వరకు ప్రజలు తీవ్రమైన ఎండలతో సతమతమయ్యారు.కాగా వర్షాలు కురుస్తుండటంతో వర్షంలో తడవ కుండ ఉండేందుకు వాహనదారులు,మహిళలు,యువతీ యువకులు తమకు కావలసిన రెయిన్ కోట్‌లను కొనుగోలు చేస్తున్నారు.దీంతో పాతనగరంలోని చార్మినార్,మదీనా,మహ్మద్ క్యాప్ మార్ట్, దివాన్‌దేవిడి,ఫత్తర్‌గట్టి ప్రాంతాలలోని మార్కెట్లలో జోరుగా రెయిన్ కోట్‌ల అమ్మకాలు జరుగతున్నాయి.అదే విధంగా చార్మినార్ పరిసర ప్రాంతాలలో ఫుట్ పాత్‌లపై కూడ వర్షాకాలం సందర్భంగా పలు రకాల రెయిన్ కోట్‌ల విక్రయాలు జరుగుతున్నాయి.చార్మినార్,చౌమహల్లా ప్యాలెస్‌లను సందర్శించటానికి వస్తున్న పర్యాటకులు సైతం చార్మినార్ రహదారులలో విక్రయిస్తున్న రెయిన్ కోట్‌లతో పాటు గొడుగులను ఖరీదు చేస్తున్నారు.

### విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం,బుక్స్ అందజేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్,జూన్ 12,ప్రభాతవార్త:**
కొత్తగా స్కూల్స్ రీఓపెనింగ్ సందర్భంగా బుధవారం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్ లంకలో పభ్రుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, నల్లకుంట డివవిజన్ కార్పొరేటర్ అమృత, బాగ్ అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పద్మ వెంకటరెడ్డితో కలిసి పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు డిప్యూటీ ఈఓ హిమాయత్ నగర్ జోన్ ఎం.విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓఎస్ అంబర్‌పేట్ మండల్ నిజాముద్దీన్, ప్రభుత్వ గవర్నమెంట్ స్కూల్ హెడ్‌మాస్టర్ పి.వెంకట్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా గురువులకు అవార్డులు

**చిక్కడపల్లి, జూన్ 12 ప్రభాతవార్త:**
తెలంగాణ బోనాల జాతర, గురుపౌర్ణమి సందర్భంగా 'గురువులకు అవార్డులు' ప్రదానం చేయాలని నిర్ణయించిన భారత్‌ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు, జైజవాన్ జై కిసాన్ జై కళాకార్ అధినేత కె.వి.రమణరావు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, గురువులకు అవార్డులను అందిస్తామని, అన్ని కళారూపాల ప్రదర్శనలు, మాస్టర్లకు అవార్డులను ఇవ్వాలని నిర్ణయించాలని, ఇందుకోసం కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తులకు ఆఖరి తేదీ జూలై 5వ తేదీ అని, ఇతర వివరాలకు 72071 77000 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చని, ఎంపిక చేసిన వారికి తెలంగాణ వరల్డ్‌రికార్డు సంస్థచే ప్రశంసాపత్రాన్ని కూడా అందిస్తామన్నారు. ఎంపిక చేసిన కళారూపాల కళాకారులకు జూలై 28 నగరంలోని కింగ్‌కోటిలో ఉన్న తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఘనంగా సత్కరించబోతున్నట్లు వివరించారు.



బోయిన్‌పల్లి మార్కెట్ వెజిటేబుల్ కమిషన్ ఏజెంట్ అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



నిరుపేద రెడ్డి కుటుంభానికి రూ.50వేలు అందజేస్తున్న మణికొండ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు.

**నార్సింగి, జూన్ 12 ప్రభాతవార్త :**
మణికొండ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం ఓ నిరుపేద రెడ్డి కుటుంబానికి రూ.50.వేలు అందజేశారు. వేమూరి తిరుమల్ రెడ్డి కొంత కాలంగా ఆర్థికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఇతడు పడుతున్న ఇబ్బందులను చూసి చలించి పోయిన రెడ్డి సంఘం ప్రతినిధులు ఇతడి బిడ్డల చదువులు, ఆరోగ్యం కోసం రూ.50వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సమావేశంలో కూచికుల్ల నరేందర్‌రెడ్డి, కందాడ శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపతి రెడ్డి, రామ సుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రమణారెడ్డి, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిక్కడపల్లిలో టిడిపి నేతల సంబురాలు



కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్

**చిక్కడపల్లి, జూన్ 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏర్పాటు కావడం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో నెలకొన్న విరక్తికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అభివర్ణించారు. అనంతరం ఆహార ప్యాకెట్లను జిహెచ్‌ఎంసి వర్కర్లకు, ప్రజలకు పంపిణీ చేశారు. అంతకుముందు చంద్రబాబునాయుడు పేరుపై చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బంగారుపుష్పార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పి.శివకృష్ణ, ఉదయ్‌కుమార్‌గుప్త, సాయి, పి.చందర్, శంకర్‌గౌడ్, రమేశ్,చారి, సాగర్, అన్నపూర్ణ, వీణాదేవి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో నిలిచే విధంగా అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ,నాల్గవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన చంద్రబాబు నాయుడు ఆయన నాయకత్వంలో ఆంధ్రరాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

**శ్రీ త్యాగరాయ గానసభ వద్ద**
చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ వద్ద తెలుగు దేశం పార్టీ నాయకులు ఎపిలో ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం మిఠాయిలు పంపిణీ చేసి సందడి చేశారు. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని రవి మిఠాయిలను పాత్రికేయులు రాయప్రోలు వెంకటరమణ తదితరులకు అందించారు. విద్వేషం పాలనకు ఆంధ్ర ప్రజలు విలక్షణమైన తీర్పును ఇచ్చాని అన్నారు.

## నకిలీ జర్దా తయారీ కేంద్రంపై ఎస్ఓటి పోలీసుల దాడి



పట్టుబడిన నిందితులు, పోలీసులు సా ్వధీనం చేసుకున్న ముడి సరుకు, మిషన్లు

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:**
బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ జర్దా తయారీ కేంద్రంపై మహేశ్వరం జోన్ ఎస్ఓటి పోలీసులు దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి పెద్ద ఎత్తున నకిలీ జర్దా ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలాపూర్ వాది-ఎ-ఒమర్ కాలనీలో నకిలీ జర్దా కేంద్రం గురించి విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్ఓటి పోలీసులు రంగంలో దిగి జర్దా తయారీ యూనిట్ యజమాని అయిన చార్మినార్ జహనుమానగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ (45), కార్మికులుగా పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరి శంకర్ రాజ్‌పుత్ (29), విక్రంసింహ్ పర్మార్ (30) లను అరెస్టు చేసి ముడి సరుకును, వివిధ రకాల మెషిన్లను, మోటార్ సైకిల్‌ను, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను, స్వాధీనం చేసుకున్న వాటిని బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.



నగరంలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్




స్కూల్స్ ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు

### -బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి



వాటర్‌బోర్డు ఎండి సుదర్శన్‌రెడ్డిని సత్కరిస్తున్న మెట్రోవాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 12 ప్రభాతవార్త:**
హైదరాబాద్ మెట్రోవాటర్‌బోర్డులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ ఉద్యోగులకు ప్రతి నెల 5వతేదీలోపు వేతనాలు ఇస్తామని బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఎండి సుదర్శన్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించి అభినందించింది. కార్మికులంతా ఎండికి రుణపడి ఉంటటారని, వాటర్‌బోర్డు చరిత్రలో ఏడాదు మొదటివారంలో జీతం రాలేదని, 10 నుంచి 20వ తేదీ వరకు రావడంతో కార్మికులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో యూనియన్ ఆధ్వర్యంలో పలుదఫాలుగా వినతి పత్రాలను అందించడం మూలంగా మొదటి నెల 5లోపు జీతాలు ఇచ్చేందుకు ఎండి చర్యలు తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ వాటర్‌బోర్డుకు మంచి పేరు వచ్చే విధంగా కష్టపడి పనిచేస్తామని, సమయానికి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు ప్రతి నెల 5లోగా జీతాలు ఇవ్వాలని కోరడంతో ఎండి సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవడం విశేషమన్నారు. ఆలస్యంగా జీతాలు రావడం వల్ల కార్మికుల పిల్లల ఫీజులు, ఇల్లు కిరాయిలు కట్టలేక, ఇతర నిత్యావసర వస్తూవుల చెల్లింపులు సమయానికి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న సంఘటనలున్నాయని అన్నారు. అనేక రోజులుగా కార్మికుల ఇబ్బందులను గమనించి బోర్డు ఎండి స్పందదించి జీతాలు సమయానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం ఆనందాన్ని కలిగించిందన్నారు. అదే విధంగా బోర్డులో ఎస్‌టిపిలో పనిచేసే కార్మికులకు కూడా మొదటివారంలోనే జీతాలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరగా అమలుకు వెంటనే ఎండి సుదర్శన్‌రెడ్డి ఆదేశించడం జరిగిందన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, బాలసుందర్ రాజు, వీరస్వామి, బాలాజీ, యాదగిరి, శ్యామ్, రాజు, సుగంద్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### -తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్



ధర్నాలో ప్రసంగిస్తున్న సుద్దాల సురేష్

**ధర్నాచౌక్, జూన్ 12, ప్రభాతవార్త:**
ఆర్టీసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుద్దాల సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను గత ప్రభుత్వ మోసం చేస్తూ వచ్చిందని, అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించటంలో ఆర్టీసీ కార్మికులు కీలకంగా పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, తక్షణమే తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి ఆధార్ కార్డు వల్ల కండక్టర్లకు సమస్యలు ఎదురవుతున్నాయి కాబట్టి ఆర్టీసీ ఐడీ కార్డును ఇవ్వాలని కోరారు. మోటార్ యాక్ట్ 1961ను అమలుచేయాలని, ఆర్టీసీలో సస్పెండ్ అయిన వారిని, రిమూవ్ అయిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన వాటిని వెంటనే అమలుచేయాలని, రిటైర్ అయిన కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని, 2017 పేస్కేల్‌కు సంబంధించిన అరియర్స్‌ను, అలవెన్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. 2013కు సంబంధించిన బాండ్ డబ్బులు అధికారులకు, కార్మికులకు పంచాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, అవసరాలను బట్టి కార్మికులకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ ఆకాంక్షల వేదిక వ్యవస్థాపకులు గోధుమల కుమారస్వామి, ఎస్టీఎంయూ నేత పున్నా హరికిషన్ మద్దతు తెలపగా, యూనియన్ నాయకులు బి.నాగేశ్వర్, డి.యాదయ్య, రాజేందర్ మేకల, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న రూ.7వేలకోట్ల ఫీజు బకాయిలు చెల్లించండి

### -డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎంపి.ఆర్.కృష్ణయ్య వినతి



భట్టివిక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని 20లక్షలమంది ఇంజనీరింగ్,మెడిసిన్,పీజీ, డిగ్రీ విద్యార్థుల మొత్తం ఫీజుల బకాయిలు 7వేలకోట్లు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్.కృష్ణయ్య డిప్యూటీ సిఎం, ఆర్థికమంత్రి మల్లుభట్టివిక్రమార్కను కోరారు. ఈమేరకు బుధవారం తనప్రతినిధిబృందంతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కాలేజీ కోర్సులు చదివే ఎస్సీ,ఎస్టీ,బిసి విద్యార్థులకు గతప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి తెస్తుండటంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేయచడం లేదన్నారు. అంతేకాకుండా కాలేజీల్లో లెక్చరర్లకు జీతాలు సైతం చెల్లించలేక యాజమాన్యాలు ఇబ్బదిపడుతుంటే ఆప్రభావం విద్యార్థులపై పడుతుందని కావున వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలును చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈప్రతినిధి బృందంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, రాజేందర్, వేముల రామ కృష్ణ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని ప్రైవేటు పాఠశాలల బస్సులపై కొరడా

- ఒక్క రోజే 46.బస్సులపై కేసులు నమోదు
- నిబంధనలు పాటించకుంటే వాహనాలను సీజ్ చేస్తాం : డిటిసి



రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రైవేటు పాఠశాలల బస్సుల పర్మిట్‌లను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు.

**నార్సింగి, జూన్ 12 ప్రభాతవార్త :**
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో బుధవారం రవాణా శాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల బస్సులపై కొరడా ఝులిపించారు. డిటిసి మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్ ఆదేశాల మేరకు రవాణాశాఖ అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి రోడ్లపైకి వచ్చారు. ఒక్క రోజులోనే వందలాది బస్సులను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న, ఫిట్‌నెస్‌లేని, పన్నులు చెల్లించని 46.బస్సులపై కేసులు నమోదు చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం అయిన తొలి రోజే రవాణా శాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల బస్సులపై విరుచుకు పడ్డారు. గతంలో జరిగిన పలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని, అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ దాడులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిటిసి మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదుర్కోకుండా సురక్షితంగా పాఠశాలలకు, ఇళ్లకు వెళ్లాలన్న ఉద్దేశంతోనే ప్రైవేటు పాఠశాలల బస్సులపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులు వచ్చే వారం రోజుల పాటు కొనసాగుతాయని, అన్ని బస్సులను పరిశీలించిన తరువాతనే తనిఖీలు ఆపుతామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో 12.వేల పైచిలుకు ప్రైవేటు బడుల బస్సులున్నాయని, వీటిలో 8.వేల బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పొందాయని, మిగితా 4.వేల పైచిలుకు బస్సులు ఫిట్‌నెస్‌ను పొందలేదన్నారు. 15. సంవత్సరాలు దాటిన బస్సులను, ఫిట్‌నెస్‌లేని బస్సులను ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పరాదని హెచ్చరించారు. అనుభవం ఉన్న, 60.సంవత్సరాల లోపు వయసున్న డ్రైవర్లు మాత్రమే బస్సులు నడుపాలని సూచించారు. విద్యాలయాల్లో నడుపబడుతున్న ప్రతీ బస్సు సంబంధిత రవాణా కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చే ప్రైవేటు పాఠశాలల బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. బుధవారం నిర్వహించిన దాడులలో రంగారెడ్డి, మేడ్చెల్, ఉప్పల్ రవాణాశాఖ అధికారులు కిరణ్‌రెడ్డి, కృష్ణవేణి, సునీత, నవీన్,ఉపాసిని, ప్రతాప్‌రాజు, త్రివేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఒ.యూ ఆర్ట్స్‌కాలేజ్‌కు పెయింటింగ్ మరమ్మతులు చేపడతాం : విసి దాన కిషోర్



ఆర్ట్స్ కాలేజ్‌ను పరిశీలిస్తున్న ఇంచార్జి విసి (ఐఎఎస్) దానకిషోర్

- -ఆర్ట్స్‌కాలేజ్ చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు
- -మెయిన్ లైబ్రరీ సమీపంలో 500 మందికి సరిపడే నూతన రీడింగ్ భవనం

**తార్నాక, జూన్ 12 ప్రభాతవార్త :**
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్భన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఒ.యూ విసి దాన కిషోర్ బుధవారం ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని లైబ్రరీతో పాటు తరగతి గదులను, సెమినార్ హాల్స్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులోని పలుగదులను పరిశీలించి విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ దాన కిషోర్ మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజ్‌లో పెయింటింగ్, మరమ్మతులు హెచ్ఎండీఏ నిధులతో చేపడుతామని హామినిచ్చారు. కళాశాల చుట్టు ఫెన్సింగ్, ఇందుకు తగిన అంచనాలను వెంటనే రూపొందించాలని అధికారులకు సూచించారు. అదేవిదంగా మెయిన్ లైబ్రరీ సమీపంలో 500 మంది విద్యార్థులకు సరిపడా రీడింగ్ భవనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. విసి వెంట రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.కుతాడి అర్జున్ రావు, వైస్ ప్రిన్సిపల్ డా.భీనవేని రామ్ షఫర్డ్, ఒ.యూ ఛీఫ్ ఇంజనీర్ రాధిక, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

**థాయ్‌లాండ్ యూనివర్సిటీలకు ఒ.యూ నుంచి ఆరుగులు పీహెచ్‌డీ విద్యార్థుల ఎంపిక**
స్టూండెట్ ఎక్స్ఛేంజ్ ప్రొగ్రాంలో భాగాంగా థాయిలాండ్ విశ్వవిద్యాలయాల్లో ఒ.యూ పరిశోధక విద్యార్థులు వెళ్లడానికి హెచ్ఎండీఏ నుంచి ఫెలోషిప్ సహకారాన్ని అందిస్తున్నట్లు ఒ.యూ ఇంచార్జి విసి దాన కిషోర్ తెలిపారు. ఒ.యూకు చెందిన వివిధ ఫ్యాకల్టీల నుంచి పీహెచ్‌డీ విద్యార్థులను ఎంపిక చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తా : బలాల


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లోని మలక్‌పేట అంధుల బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు కార్పొరేటర్లు మినాజుద్దీన్, కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే బలాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, టెక్ట్స్ బుక్స్, నోటు పుస్తకాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి తిరునగరి రాధాకృష్ణ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, నోటు పుస్తకాలు, టెక్ట్స్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుసిడి అధికారి యుగేంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : శాంతి శేఖర్


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

**నాచారం, జూన్ 12 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ వీరారెడ్డి నగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. వీరారెడ్డినగర్ కాలనీలో స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల పిలుపు మేరకు కార్పొరేటర్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చిన సమయంలో రోడ్లపై నీరు వచ్చి గంటల తరబడి నిలిచిపోతుందని కార్పొరేటర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలో డ్రైనేజీ పైపులైన్లను వేసి, సీసీ రోడ్డు వేసినప్పటికి సమస్య అదేవిధంగా ఉందని కార్పొరేటర్‌కు చెప్పారు. వర్షపు నీరు వెళ్లేందుకు మరో పైపులైన్ వేయిస్తామని కార్పొరేటర్ కాలనీ వాసులకు హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, శివకుమార్,గంగాధర్, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్స్‌పెక్టర్ వవిజయ్‌కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## సేవా మార్గమే మానవ జీవితానికి సార్ధకత : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి


ఉప్పల స్వప్న శ్రీనివాస్‌గుప్తకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** సామాజిక సేవతోనే మానవ జీవితానికి సార్ధకత చేకూరుతుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్ ప్రసాద్‌ల్యాబ్‌లో సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిరుపేదలకు ఉత్తమ సేవలు అందిస్తున్న ఉప్పల ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తకు బుధవారం సెలబ్రెటీ అవార్డ్స్‌ను గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం సుమారు 8వేల మందికి పుస్తె మట్టెలను అందజేసి ఆదర్శంగా నిలిచిన ఉప్పల స్వప్న శ్రీనివాస్‌గుప్తాను అభినందించారు. అదేవిధంగా ఐవిఎఫ్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకోసం సంవత్సర కాలంలోనే 2306 యూనిట్ల రక్తాన్ని అందజేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలుకు సెలబ్రిటీ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు ప్రొడ్యూసర్ మురళీమోహన్, సుమన్, దర్శక నిర్మాతలు ఎస్వీ.కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, డాక్టర్ విజయభాస్కర్, రామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కొత్త షరతులతో ఖాతాదారులకు నష్టం

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో కోపరేటివ్ బ్యాంకులకు ప్రబుత్వం కొత్త షరతులు విధించడంతో ఖాతాదారులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆర్‌బిఐ మాజీ అధికారి డాక్టర్ వైద్యనాథ్ పేర్కొన్నారు. అల్కాపురి నక్షత్ర హోటల్లో హైదరాబాద్ జోన్ బ్యాంకు శాఖల సంప్రదింపుల కమిటీ సభ్యుల సదస్సు వైద్యనాథన్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మల్టీ స్టేట్ విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు, పురోగతి, సహకార రంగంలో ఇంకా రావాల్సిన మార్పులు, వివిధ స్థాయిలో ప్రజలకు ఇచ్చే రుణాలు, ఇతర సహకార బ్యాంకుల పని విధానం గురించి వివరించారు. హైదరాబాద్ జోనల్ మేనేజర్ పి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ జోన్‌లో ఉన్నటువంటి ఆయా శాఖల ఆర్థిక స్థితిగతులు, పని విధానం బ్యాంకు లావాదేవీలు, ఖాతాదారుల షేర్లు, వాటి ఒడిదుడుకులు, ఖాతాదారులకు చేస్తున్నటువంటి సేవలను, లాభనష్టాలను వివరించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ చలికాని కృష్ణమోహన్‌రావు, ఆచల రామకృష్ణారావు, పి.నారాయణస్వామి, సబ్యుడు బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

## పిల్లలు బాగా చదువుకోవాలి : భాగ్యలక్ష్మి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూన్ 12 ప్రభాతవార్త:** పిల్లలు బాగా చదువుకోవాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని గడ్డిఅన్నారం, సంజీవయ్యనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల విద్యార్థులకు కొత్తపుస్తకాలు,స్కూల్ యూనిఫామ్స్‌ను అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలని, చిన్న చిన్న కారణాలవల్ల బడికి దూరంగా ఉండవద్దని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు, స్కూల్ యాజమన్యానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పిల్లలను పనుల్లో ఉంచకుండా బడికి పంపించేవిధంగా వారిని ప్రోత్సహించాలని స్కూల్‌యాజమాన్యానికి, పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధాకృష్ణమూర్తి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్, బడంగ్‌పేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పంపిణి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** వేసవి సెలవులు ముగిసి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్, బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, డ్రెసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, లిక్కి కృష్ణారెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు అర్జున్, రామాంజులురెడ్డిలతో పాటు రహీం, సునీత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## యుజిడి సమస్య పరిష్కారానికి చర్యలు


విజయపురికాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రజితపరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజితరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని న్యూశాంతినగర్, సాయిరాంకాలనీ, సాయిబాబాకాలనీ, విజయపురికాలనీ, సూర్యనగర్, సరస్వతికాలనీ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయపురికాలనీలో ఓపెన్ డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, ఎఇ వసంత, జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, కాలనీ సంఘం నేతలు పి.నాగిరెడ్డి, వెంకటేష్‌గుప్త, అంజిరెడ్డి, మధన్‌గౌడ్,సుమన్‌శర్మ, రాజేందర్ రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మధు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రత్నం, అలీమ్, వెంకట్‌రెడ్డి, అనిల్, సురేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఆర్‌టిఓ


వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని నాగోల్‌ఆర్టీవో పి.రవీందర్ కుమార్ హెచ్చరించారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ ఆదేశాల మేరకు బుధవారం విద్యాసంస్థల బస్సుల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల బస్సులు ఆర్టీఏ నియమ నిబంధనలకు అనుగుణంగా నడిపించాలని సూచించారు. నాగోలు ఆర్టీఏ కార్యాలయం వద్ద బుధవారం ఆర్టీఏ అధికారులు బస్సుల ఫిట్నెస్, ఇన్సూరెన్స్, టాక్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ తనిఖీలలో నాగోలు ఆర్టీఏ అధికారులు కే.రవీందర్‌రెడ్డి, కే.అమర్‌నాథ్, అనిత, సాధుల శ్రీనివాస్, శీతల్, విష్ణుదీపక్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించండి


మాజీ మంత్రి జానారెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

**సైదాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి మాజీ హోం మంత్రి కుందూరు జానారెడ్డిని కోరారు. స్వర్ణకార సంఘం నాయకులతో కలిసి ఆయన జానారెడ్డిని కలిసి వినతిపత్రంఅందజేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్వర్ణకార సంఘం నాయకులు అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డిని కలిసినప్పుడు తమిళనాడు తరహాలో స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు, 272 జిఓను సవరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, కోశాధికారి గొట్టిముక్కల చంద్రశేఖర్ చారి, కార్యదర్శి రాగిఫణి సతీష్ చారి, సహాయ కార్యదర్శి పోతులూరి చారి, రమేష్ చారి, సంతోష్‌చారి, గిరి చారి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు : చింతల

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయం రావడంతో బుధవారం సురేంద్రనాథ్‌యాదవ్ ఆయా కాలనీలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను గురించి వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా ఒత్తిడి తీసుకు వస్తామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన : ఎమ్మెల్యే


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జూన్ 12 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటూ ప్రయోజకులవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అధ్యాపకులు ఉత్తమ బోధన అందిస్తున్నారని తెలిపారు. చదువుల విషయంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు గట్టి పోటీ ఇస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హీర్యానాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్‌గౌడ్, పాఠశాల హెడ్ మాస్టర్ దుర్గలత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

**సాహెబ్‌నగర్‌లో...** బి.యన్.రెడ్డినగర్ డివిజన్, సాహెబ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్,టెక్ట్స్ బుక్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ హీర్యా నాయక్, ప్రధానోపాధ్యాయులు దినేష్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, ఎపిపిఎస్ మమత, నాగలక్ష్మి, ఉపాధ్యాయుల మోర్చాకన్వీనర్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంగూడ ఆదిత్యనగర్ ప్రధాన రోడ్డును నిర్మించాలని వినతి : సాయికిరణ్‌రెడ్డి


సబితారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్ కోల శ్రీనివాస్

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ ఆదిత్యనగర్ కాలనీ ప్రధాన రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన పలువురితో కలిసి బుధవారం సబితారెడ్డి వద్దకు వెళ్ళి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆదిత్యనగర్ మెయిన్‌రోడ్డు సమస్యను అదే విధంగా వివిధ పనుల గురించి సబితారెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు రోడ్డుపనులు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుర్రంగూడ గ్రామ పంచాయతీ మాజీ వార్డు మెంబర్ పుట్టగళ్ళ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 34 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు : కార్పొరేటర్ చేతన


కామాక్షిపురంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ కామాక్షిపురంలో రూ. 34లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కామాక్షిపురం కాలనీలో అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. గతంలో కామాక్షిపురంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండేదని, సమస్య పరిష్కారానికి పెద్ద పైపులు వేసినట్లు తెలిపారు. పనులు పూర్తి చేసి సిసి రోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ సాయికిరణ్, కాలనీ నేతలు రవి, కె.లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విధ్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ


విధ్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మరో చిత్రంలో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**సైదాబాద్, జూన్ 12 నప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లోని మూడు గుళ్ల వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలతోపాటు శంకేశ్వర్ బజార్, గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లోని విధ్యార్థులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.

**ఎల్‌బినగర్ ప్రభుత్వ పాఠశాలలో...** పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో బడిబాటలో భాగంగా ఎల్‌బినగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విధ్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో చాలా ఏళ్ల తర్వాత పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విధ్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందాయని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా చిలుకానగర్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయడంతోపాటు, వారికి భోజనం ఇతర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కె.జగన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఐడిఏలో అధ్వాన్నంగా తయారైన రోడ్లు


ఐడిఏ జెర్సీ నుంచి డీమార్ట్ రోడ్డు వర్షం నీటితో అద్వాన్నంగా తయారైన దృశ్యం

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ పారిశ్రామికవాడలో రోడ్లు అధ్వాన్నంగా తయారైయ్యాయి. ఉప్పల్ పారిశ్రామికవాడ విషయంలో ఐడిఏ అధికారులు అభివృద్ధిపై పట్టించుకోకపోవడంతో పరిస్థితి దీనంగా తయారైంది. ఉప్పల్ జెర్సీ నుంచి డీమార్ట్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిపోవడంతో నిత్యం ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉప్పల్ ఐడిఏ నుంచి నాగోల్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ దారిలో వెళుతున్నాయి. అయితే పారిశ్రామికవాడ అభివృద్ధిగురించి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్ల విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సిపిఎం పార్టీ కార్యదర్శి జి.భీష్మాచారి పేర్కొన్నారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ

**నాచారం, జూన్ 12 ప్రభాతవార్త :** మల్లాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న పాఠ్యపుస్తకాలను ప్రధానోపాధ్యాయులతో కలిసి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్కూలల్లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తానని హామినిచ్చారు.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్ధేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి: కార్పొరేటర్


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్, గ్రామపెద్దలు

**హయత్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** విద్యార్థులు చిన్నప్పటినుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఆయన హయత్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం సమకూర్చిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలను కొనసాగిస్తూ ఉచిత విద్యను అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తనవంతుగా హయత్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు సైతం పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంద్ర, ఏపీసీ చైర్మన్ అమరావతి, గ్రామపెద్దలు నక్కదర్శన్, బోడబిక్షపతి, భాస్కర్‌సాగర్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంగాదర్, శ్రీనివాస్, శ్రీదేవి, సరిత, ఉతనఒతర, నాగశైలజ పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రబుత్వ పాఠశాలలో అవసరమైన మాలుగా సుకలు కలిగించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం పునఃప్రారంభం సందర్భంగా సరూర్‌నగర్ డివిషన్లోని ప్రబుత్వ పాఠశాలలను కార్పొరేటర్ సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కొరత, నీటి సరఫరా సమస్యలు పరిష్కరించాలని ప్రబుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఎఇ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఉప్పల్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉప్పల్ కల్సా పరిధిలోని విజయపురికాలనీ, ర్యాంకర్స్ స్కూల్, బాలజీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ కృష్ణ దియేటర్, బాలాజీ నర్సింగ్‌హోమం, రఘురామ రెసిడెన్సీ, ద్వారాకమాయి తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ తెలిపారు. అదే విధంగా ఉప్పల్ కూరగాయల మార్కెట్ ఉప్పల్ కల్సా పరిధిలోని కూరగాయల మార్కెట్, ఉప్పల్ ప్రధాన రహదారి, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. అదేవిధంగా 11 కెవి బోడుప్పల్ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ ప్రధాన రహదారి, కుమ్మరిబస్తీ, శ్రీరామకాలనీ, టిఐక్స్ ఆసుపత్రి, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి రెండున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ నిఖిల్ తెలిపారు.